క్లుప్తంగా

శీలంవారిపల్లెలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలం వారిపల్లెలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ, వైద్య సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళాశాల డీన్ డాక్టర్ రఘుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీవిద్య, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వన సంరక్షణ అందరి బాధ్యత



హనుమంతునిపాడు: వన సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కనిగిరి బోధి ధర్మ పాఠశాల హెచ్‌ఎం టి.జ్యోతి అన్నారు. హాజీపురం ఫారెస్టు రేంజ్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన టూరిజం పార్కులో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 100 మొక్కలు నాటారు. కార్తీక మాసం వనమహోత్సవంలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మొక్కలు నాటించారు. విద్యార్థులకు వనాల ప్రాముఖ్యతను, ప్రకృతి వల్ల మానవ జాతికి, జీవకోటి ప్రాణాధారమని సూచించారు. వనాలు, వాటి సంరక్షణపై నాటక రూపంలో పిల్లలకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. బోధిధర్మ స్కూల్ ప్రిన్సిపాల్ టి .జ్యోతి, ఉపాధ్యయులు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

11న ప్రతిభా పరీక్ష

కనిగిరి రూరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో, ఐదో తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో ఈ నెల 11న ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం సి.విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బాలల దినోత్సవం నాడు రూ.15 వేల నగదును సువెన్ ఫౌండేషన్, కేవిరెడ్డి, రెడ్డం వారిపల్లి వారి సహకారంతో అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రకృతి అందాల్లో విహరిద్దాం..!





భైరవకోన ప్రాంతం

- కార్తీక వన భోజనాలకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల వైపు ప్రజల చూపు
- నియోజకవర్గంలో ఎన్నో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు

కనిగిరి రూరల్: కార్తీక మాసంలో ఆధ్యాత్మిక, విహార యాత్రలతో పాటు, కార్తీక వన భోజనాలకు ప్రత్యేకత ఉంటుంది. ఈ నెలలో అన్ని ఆలయాల్లో, నదీ తీరాల్లో, ఇళ్లలోనూ దీపాలు వెలిగించడం పుణ్యప్రదంగా భావిస్తారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రలు, శైవ క్షేత్రాల్లో ప్రత్యేక కార్తీక శోభ సంతరించుకుంటుంది. అలాగే ప్రకృతి అందాల మధ్య కార్తీక వన భోజనాలకు ప్రాధాన్యమిస్తారు. ఆయా సామాజిక వర్గాల వారు వారి వారి బంధుగణం, స్నేహితులు, కుటుంబసభ్యులతో కార్తీక వన భోజనాలను ఏర్పాటు చేసుకొని ఎంతో సంతోషంగా గడుపుతారు.

● కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా జిల్లాలోనే ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన భైరవకోనతో పాటు, కనిగిరి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో, మండలంలోని నందనమారెళ్ల దేవస్థానంలో, పునుగోడు సిద్ధేశ్వర స్వామి ఆలయాలతో పాటు... పీసీపల్లి మండలంలోని పాలేటి గంగ, పంచాలింగాల కొండ తదితర అనువైన ప్రాంతాల్లో వన భోజనాలను ఏర్పాటు చేసుకుంటారు. ఈ కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, వివిధ రకాల పోటీల్లో, మహిళల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు.



నందనమారెళ్ల గుడి ప్రాంతం

వన భోజనాలకు అనువైన ప్రదేశాలు ఇవి..

- నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని అంబవరం కొత్తపల్లి పంచాయతీలో ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోన ఆలయం. ఇక్కడ త్రిముఖ దుర్గాదేవి ఆలయం విశిష్టత, అంతేగాకుండా నిత్యం సలసెలా పారే జలపాతం ప్రత్యేక ఆకర్షణ.. సుమారు 20 కిలోమీటర్ల విస్తీర్ణంలో రహదారి వైపు దట్టమైన తోటలు చల్లని గాలి వాతావరణంలో ఈ ప్రదేశం ఉంటుంది. భైరవకోన ఆలయ ప్రదేశం కొండల నడుమ.. నల్లమల అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఆలయ సమీపంలో వివిధ సామాజిక వర్గాల సత్రాలు ఉన్నాయి. కనిగిరి నుంచి సుమారు 70 కిమీటర్ల దూరం ఉండగా, సీఎస్‌పురం నుంచి 30, పామూరు నుంచి 42 కిమీల దూరం ఉంటుంది. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.
- కనిగిరి మండలంలోని నందన మారెళ్ల గ్రామంలో కొండపైన ఉన్న బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో పచ్చని చెట్లు, కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వన భోజనాలకు అనువైన ప్రదేశం ఉంటుంది.
- పునుగోడులోని మునుగోడు సిద్ధేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక వన భోజనాలకు అనువైన ప్రదేశం ఉంది. గుడికి సమీపంలోనే కొనేరు ప్రాంతం కూడా ఉంది.



భైరవకోనలో జలపాతం

- పామూరు మండలంలో మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయం, అనుమనగిరి కొండ ప్రదేశం కూడా వన భోజనాలకు అనువైన ప్రదేశంగా ప్రశాతం వాతావరణం ఉంటుంది.
- పీసీపల్లి మండలంలో వెంగళాపురం పంచాయతీలోని పాలేటి వాగు సమీపంలో ఉన్న పాలేటి గంగమ్మ గుడి, పంచలింగాల కొండ గుడి ప్రాంతంలో కార్తీక వన భోజనాలకు అనువైన ప్రదేశాలుగా, ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఇక్కడే వివిధ ఆలయాల్లో, పలు సంఘాల సత్రాలు కూడా ఉన్నాయి.

సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

కనిగిరి రూరల్: సత్వర న్యాయం న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, ఏ ఇతర కారణాల వల్లనైనా, వెనుకబడిన వాళ్లని న్యాయం అందకుండా ఉండే పరిస్థితులను రూపు మాపేందుకు న్యాయ సేవాధికార చట్టం 1995 నవంబర్ 9న ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లోక్ అదాలత్, న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు, హెల్ప్ లైన్ 15100 నంబర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో వినికిడిలోపం ఉన్న దివ్యాంగులకు న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర చేతుల మీదుగా వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు బాల నారాయణ, న్యాయవాదులు పాశం పిచ్చయ్య, సాధు కొండలరావు, ఎస్‌కే సుమైర్, పారాలీగల్ వలంటీర్లు రమేష్, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు, కనిగిరి అధ్యక్షుడు టి.శ్రీనివాస్, సహాధ్యక్షులు అరుణోదర్, సంస్థ సభ్యులు, న్యాయ సేవాధిక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న జడ్జి భరత్‌చంద్ర

వ్యక్తి ఆత్మహత్య

కనిగిరి రూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కనిగిరిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మార్కాపురం పట్టణానికి చెందిన కాకుటూరి చెన్న కృష్ణయ్య(40) పదేళ్ల నుంచి కనిగిరి వచ్చి స్టిక్కరింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక జీప్ సెంటర్ వెనుక వీధిలో నివసించే చెన్నకృష్ణయ్య గత 5 ఏళ్లుగా మద్యానికి తీవ్రంగా బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులను డబ్బుల కోసం బెదిరిస్తుండేవాడు. ఎప్పటిలాగే తాగి ఇంటికి వచ్చి మద్యానికి డబ్బులు అడిగాడు. కుటుంబసభ్యులు ఇవ్వకపోవడంతో నిద్రమాత్రలు మింగానని చెప్పి యధావిధి బెదిరించాడు. దీన్ని కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. దీంతో ఎవరూ లేని ఇంట్లోని రేకుల గదిలోకి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత ఇంట్లో వాళ్లు వెళ్లి గమనించగా.. ఉరేసుకుని జారి మంచంపై పడినట్లు ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు పరిశీలించగా అపస్మారక స్థితిలో కన్పించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడు నిద్రమాత్రలు మింగడం వల్ల మృతి చెందాడా.. లేక ఉరేసుకోవడం వల్లే చనిపోయాడా.. ? అనేది పోస్టుమార్టంలో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా సీఎస్‌పురంతో పాటు మండలంలోని పెదగోగులపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ డి.మంజునాథ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. ఓటర్లజాబితాలో తప్పులు, బూత్‌ల మార్పు కోసం కూడా ప్రత్యేక ఓటు నమోదులో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోలింగ్ బూత్‌లలో నిర్దేశిత తేదీల్లో బీఎల్‌ఓలు విధిగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

టంగుటూరు: ప్రభుత్వం ముందు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కరపత్రాలను టంగుటూరులో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం టంగుటూరు ఏరియా కమిటీ కన్వీనర్ టి.రాము మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. జిల్లాలో వెలిగొండ, సంగమేశ్వరం ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వి.మోజెస్, కె.శ్రీనివాసరావు, ఎం.యానాది, టి.పాపారావు, జి.సాల్మన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

భూగర్భ జలాలు పెంచేందుకే ఇంకుడు గుంతలు

మద్దిపాడు: భూగర్భజలాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు మంజూరు చేస్తున్నాయని ఏపీఓ గడ్డం రాంబాబు అన్నారు. స్థాని గౌడాస్ కాలనీలో నూతనంగా మంజూరైన ఇంకుడు గుంతలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1000 మంది లబ్ధిదారులను గుర్తించి వారి ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు తీయిస్తామన్నారు. ఒక్కో గుంతకు రూ.6 వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇళ్లలోని వాడుక నీరు ఈ గుంతల్లోకి వచ్చేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఇంకుడుగుంతలు నిర్మించుకొని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఏపీఓ రాంబాబు

ఆరోగ్యకర ఆహారం అందించడమే లక్ష్యం



కందులూరులో కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



రైతుతో ద్రవ జీవామృతం తయారుచేయిస్తున్న అధికారులు

టంగుటూరు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకర ఆహారం అందించడమే లక్ష్యమని ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కందులూరు ఐసీఆర్పీ, మహిళా రైతు తెల్లా త్రివేణి ఆధ్వర్యంలో 200 లీటర్ల దశపర్ణి కషాయాన్ని శనివారం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇలా తయారు చేసుకున్న కషాయాన్ని అన్ని పంటల కాలంలో రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల లద్దె పురుగుతో పాటు తెగుళ్లను కూడా నివారించవచ్చన్నారు. కందులూరులో రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించి కషాయాల వైపు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. ప్రకృతి సేద్యంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని సూచించారు. అనంతరం గ్రామంలోని రైతులతో పంటలపై వచ్చే తెగుళ్లు, చీడపీడలను నివారించడానికి ఎటువంటి రసాయనాలు వాడకుండా ప్రకృతిలో లభించే ఆకులు, ఆవు పేడ, ఆవు మూత్రం ద్వారానే తక్కువ ఖర్చుతో కషాయాలను తయారు చేసుకోవచ్చని సూచించారు. కొణిజేడు యూనిట్ ఇన్‌చార్జి వెంకటరావు, ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, త్రివేణి, హరిత, కవిత, జ్యోత్స్న, శృతి, పద్మావతి రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో భూమి సారవంతం

సింగరాయకొండ: ప్రకృతి వ్యవసాయంలో భూమి సారవంతంగా ఉండి నాణ్యమైన పంట దిగుబడులు లభిస్తాయని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకటరమణ అన్నారు. మండలంలోని కలికవాయ గ్రామంలో రైతు వరిపొలంలో ద్రవజీవామృతం కలిపి వాడాలని సూచించారు. ద్రవ జీవామృతాన్ని కాలువ నీటి ద్వారా పారించటం వల్ల వరిలో ఎక్కువ పిలకలు వచ్చి అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. ఇది తయారు చేసేందుకు 5 రోజుల సమయం పడుతుందని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో కోటిసోమవారం



జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరుడు



కె.బిట్రగుంటలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం



పునుగోడు సిద్ధేశ్వర స్వామి ఆలయంలో విశిష్ట పూజలు



విశిష్ట అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి

పామూరు: మండలంలో కోటిసోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహావిష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రం రోజు కాగా శివ కేశవుల ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక వల్లీ సమేత భుజంగేశ్వరస్వామి ఆలయంలో భుజంగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, వల్లీ అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు.స్థానిక మదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, అయ్యప్ప ఆలయంతో పాటు అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షిసమేత రామలింగేశ్వరస్వామి, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి, అనుమునిగిరి శివరామ బ్రహ్మక్షేత్ర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సీఎస్‌పురం (పామూరు): కోటిసోమవార వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె ప్రముఖ పురాతన ఆలయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో అర్చకులు రామ్మూర్తి, శ్రీనివాసులు ఆలయంలోని తిరుమలనాథస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అభిషేకం అనంతరం పూజలు చేశారు. అనంతరం భక్తులు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. భైరవకోన క్షేత్రంలో నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

కనిగిరి రూరల్: కోటి సోమవారం వేడుకలను వైభవ,గా నిర్వహించారు. భక్తులు వేకువజామునుంచే ఆలయాలకు వెళ్లి ఎంతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఉన్న భవానీశంకర స్వామికి కార్తీక దీపాలు వెలిగించి విశిష్ట పూజలు చేశారు. స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అయ్యప్ప పీఠంలో స్వాముల భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రీ, ఈర్ల గురవయ్య, ఏసీ చెంచులు, మండ్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నందన మారెళ్ల బాలకోటేశ్వర స్వామి ఆలయం, పునుగోడులోని సిద్ధేశ్వర స్వామి ఆలయం, దొరువు వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర సమేత శివాలయం, శైవ క్షేత్రాల్లో విశిష్ట పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): కోటి సోమవారం పర్వదినం సందర్భంగా శనివారం జరుగుమల్లి మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక రుద్రాభిషేక పూజలు చేశారు. కె.బిట్రగుంటలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివలింగానికి రుద్రాభిషేక పూజలు, హోమం నిర్వహించారు. మహిళలు ఉపవాసదీక్షలతో ఆలయంలో దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

సింగరాయకొండ: మండలంలోని కోటి సోమవారం సందర్భంగా ప్రత్యేక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. ఊళ్లపాలెం కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శివలింగానికి రుద్రాభిషేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. పాకల, శానంపూడి, కలికవాయ, సోమరాజుపల్లి ఆలయాల్లో శివలింగానికి పూజలు నిర్వహించారు.

టంగుటూరు: మండలంలో కోటి సోమవారం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్ములపాలెం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేరాలయం, పంచముఖేశ్వర స్వామి 1116 శివలింగాల ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృత అభిషేకాలు, గోత్రనామార్చన విశేష పూజలు చేశారు. పసుకుదురు పురాతన శివాలయం, టంగుటూరు శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విశిష్టాలంకరణలో వల్లీ అమ్మవారు



ఊళ్లపాలెంలోని కాశీ విశ్వేశ్వరస్వామి



1116 శివలింగాలు మొక్కుతున్న భక్తులు



సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలు

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకల భారీ కేక్‌ను కట్ చేశారు. పార్టీ శ్రేణులకు దద్దాల నారాయణ స్వీట్లు, కేక్‌లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఒకేరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, ఆవుల భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు జి.బొర్రారెడ్డి, భువనగిరి వెంకటయ్య, జి. ఆదినారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఎర్రబల్లి దేవరాజ్, దాసరి మురళి, కొండారెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, కటికల వెంకట రత్నం, పల్నాటి భాస్కర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, మూలే రాజశేఖర్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, కృష్ణారెడ్డి, వాకుమళ్ల రాజశేఖర్ రెడ్డి, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, తమ్మినేని ఉమాశంకర్‌రెడ్డి, దద్దాల రాములు, వెంకటస్వామి రెడ్డి, మహిళా నాయకులు నాగమణి, షకీలా, భారతీ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



దద్దాల ఆధ్వర్యంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

కొండపి: లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రవికుమార్ అన్నారు. కొండపిలో ఆయన మాట్లాడుతూ లంపి స్కిన్ ముద్ద చర్మవ్యాధి ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన క్రిముల వల్ల సంక్రమిస్తుందన్నారు. ఆవు జాతి పశువుల్లో, గేదెజాతి పశువుల్లో సంక్రమిస్తుందన్నారు. తెల్ల పశువుల్లో ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి నిరోధక టీకాలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో, ముప్పవరం, గ్రామీణ పశువైద్యశాల, కె. ఉప్పలపాడు పశు వైద్య డిస్పెన్సరీలో, కొండపి వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.రవికుమార్

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీ లోని విగ్రహాల సెంటర్‌లో అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న విజయలక్ష్మి బెల్టుషాపుపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 19 బాటిళ్లు స్వాధీనం చేసుకుని విజయలక్ష్మిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.